## హ్యాట్సాఫ్ సిందూర్



హ్యాట్సాఫ్ సిందూర్ అంటూ నినాదాలు చేస్తున్న ఉపాధికూలీలు

సారంగాపూర్, మే 9 : పహల్గాం ఉగ్రదాడికి ప్రతి చర్యగా భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు సారంగాపూర్ మండలం పెంబట్ల, రంగపేట, లక్ష్మీదేవిపల్లి, బట్టపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలు మద్దతు పలికారు. శనివారం 'హ్యాట్సాఫ్ సిందూర్' అంటూ హర్షం వ్యక్తం చేశారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోల జమున శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బోడ్డుపెల్లి రాజన్న, విండో చైర్మన్ గురునాథం మాల్లారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తేలు రాజు, నాయకుడు కోండ్ర రాంచంర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామడుగు రవి, తదితరులు పాల్గొన్నారు.

## మురళీనాయక్‌కు నివాళి




ఎల్లారెడ్డిపేటలో ఆర్మీ జవాన్ మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 9: పాకిస్థాన్ కాల్పుల్లో మృతిచెందిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్‌కు బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు కలిసి మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్ రావు, పీఏసీఎస్ చైర్మన్ గుండారాపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు పిల్లి కిషన్, బీమేష్, రాజు నాయక్, నర్సింహులు, రాజిరెడ్డి, సుధాకర్ రావు, సీత్యనాయక్, రాము, కళ్యాణ్, బంటి ఉన్నారు.

## వేములవాడ దవాఖానపై రెడ్‌క్రాస్ గుర్తు



వేములవాడ ఏరియా దవాఖాన భవనంపై వేసిన రెడ్ క్రాస్ గుర్తు

వేములవాడ, మే 9: యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ ప్రభుత్వ ఆదేశాల మేరకు వేములవాడ ఏరియా దవాఖాన భవనంపై 12 అడుగుల పొడవు, వెడల్పుతో తెలుపు, ఎరుపు రంగులో రెడ్ క్రాస్ గుర్తు వేశారు. యుద్ధ సమయంలో అత్యవసర వైద్య సేవలు అందించే దవాఖానలపై దాడులు చేయకూడదని జెనీవాలో కుదుర్చుకున్న అంతర్జాతీయ యుద్ధ నియమాల్లో భాగంగా ఈ గుర్తు వేసినట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య శుక్రవారం తెలిపారు.



వేములవాడ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

## జయహో సేన

వేములవాడ టౌన్, మే 9 భారత సైన్యానికి సకలజనం సలాం కొడుతున్నది. పహల్గాం దురాగతానికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముందుకుసాగుతుండడంపై హర్షం వ్యక్తం చేస్తున్నది. పాక్ దొంగచాటుగా చేస్తున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, ఆ దేశానికి చుక్కలు చూపిస్తుండడంతో గర్వపడుతున్నది. సైన్యానికి సంఘీభావంగా శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు తీశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ సూచనల మేరకు అన్ని ఆలయాల్లో పూజలు చేశారు. వేములవాడ రాజన్న ఆలయంలో చండీ సహిత రుద్ర హోమం నిర్వహించారు. భారత యుద్ధవీరులకు సంపూర్ణ విజయం కలుగాలని, భారత త్రివిధ దళాలు క్షేమంగా ఉండాలని కోరుకున్నారు.




జగిత్యాలలో ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు






# యుద్ధం ఎప్పుడైనా గెలుపు మనదే

## పాకిస్థాన్ పెద్ద పిరికిపంద

### వార్ చేతగాకే ఉగ్రవాదం

- మన సైనికులను చూస్తేనే పాక్‌కు వణుకు
- తలుచుకుంటే ఆ దేశాన్ని ఒక గంటలో నేలమట్టం చేసే శక్తి మనకున్నది
- పహల్గాం ఘటన తర్వాత ప్రతి సైనికుడి రక్తం మరిగిపోతున్నది
- ఆర్మీ నుంచి పిలుపు వస్తే వెంటనే వెళ్తాం.. యుద్ధంలో పాల్గొంటాం
- ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలి
- ప్రతి ఒక్కరూ ఐక్యతను చాటాలి
- 'నమస్తే'తో కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ సైనికులు

'పాకిస్థాన్ పెద్ద పిరికి పంద. తలుచుకుంటే ఆ దేశాన్ని ఒక గంటల్లో నేలమట్టం చేసే శక్తి మన ఇండియన్ ఆర్మీకి ఉన్నది. ఇప్పటి వరకు జరిగిన ప్రతి యుద్ధంలోనూ భారతే గెలిచింది. ఇప్పుడు మరింత టెక్నాలజీతో దూసుకెళ్తున్నది. ఇప్పుడు జరిగే యుద్ధంలోనూ మళ్లీ మన దేశమే గెలుస్తుంది. మనమంటే పాక్‌కు చావు భయమే. అది వాళ్లకు కూడా తెలుసు' అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ సైనికులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం పాకిస్థాన్‌తో యుద్ధం జరుగుతున్న తరుణంలో 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసిస్తూనే.. 'నమస్తే తెలంగాణ'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. 1971లో పాక్‌తో వచ్చిన యుద్ధంలో.. 1999లో వచ్చిన కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న రోజులను, అప్పుడు ఆ దేశ సైనికులను మట్టికరిపించిన తీరును వివరించారు. పాక్ సైనికులకు మనతో యుద్ధం అంటేనే తడిసిపోతుందని, యుద్ధం చేతగాకనే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంటారని చెప్పారు. పహల్గాం దాడి ఘటన తర్వాత తమ రక్తం మరిగిపోతున్నదని, ఆర్మీ నుంచి పిలుపు వస్తే వెంటనే యుద్ధంలో పాల్గొని బుద్ధి చెబుతామని చెబుతున్నారు.

-కరీంనగర్, మే 9 (నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి (నమస్తే తెలంగాణ)

### మనకు పటిష్ట నాయకత్వం ఉన్నది



మన దేశం ఎంతో పటిష్టమైన నాయకత్వాన్ని కలిగి ఉన్నది. మొన్న జరిగిన ఆపరేషన్ సిందూర్ అందుకు నిదర్శనం. పాకిస్థాన్ మిలిటరీ ఎస్టాబ్లిష్‌ని టచ్ చేయకుండా కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ రాఫెల్ జెట్లతో పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను న్యూట్రలైజ్ చేశారు. కశ్మీర్ మీద ఆశలు పెట్టుకుంటే ఆయుష్షు తీరినట్టేనని స్పష్టం చేశారు. ఈ దాడుల తర్వాత ఇండియా రాఫెల్‌ను పడగొట్టామని పాకిస్థాన్ మీడియా కూతలు కూసింది. అసలు మన దేశ ఎల్‌వోసీని దాటి పోనే లేదు. ఎలా పడగొడతారనేది నా ప్రశ్న. ఒకే చోట ఉండి తొమ్మిది ఉగ్ర స్థావరాలను కచ్చితంగా టార్గెట్ చేసి ధ్వంసం చేశారు. ఉగ్రవాదులు ఏ దేశ ఆడబిడ్డల సిందూరాన్ని తుడిచారో.. అదే సిందూరం ఎవరికి ఎక్కువ ప్రతీకనో వారితోనే పాకిస్థాన్‌పై మన దేశం ప్రతీకారం తీర్చుకున్నది. వార్ క్రైమ్ చేస్తున్న పాకిస్థాన్‌ను ప్రపంచం మొత్తం వ్యతిరేకిస్తున్నది. ఇలాంటి కీలక సమయాల్లో ప్రతి పౌరుడూ బాధ్యతగా మెలగాలి. ప్రతి కొత్త వ్యక్తిని గుర్తించాలి. రద్దీ ప్రాంతాల్లోకి వెళ్లద్దు. భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌ను ఫాలో అవ్వాలి. గుర్తించిన రెడ్ జోన్లలో అలర్ట్‌గా ఉండాలి. తప్పనిసరి అనిపిస్తే గానీ ప్రయాణాలు చేయద్దు. నేను 1999లో కార్గిల్ యుద్ధం ముగిసిన తర్వాత 2001లో ఆర్మీలో రిక్రూట్ అయ్యాను. శిక్షణ తర్వాత కార్గిల్ యుద్ధాన్ని కొనసాగిస్తూ చేపట్టిన ఆపరేషన్ పరాక్రమంలో మూడేళ్ల పాటు పని చేశాను. కశ్మీర్‌లోని నౌగాం సెక్టార్‌లో అప్పుడు నిత్యం ఫైరింగ్ జరిగేది. మార్చి నుంచి జూన్ వరకు ఎక్కువ చొరబాటుదారులు మన దేశ సరిహద్దులు దాటే ప్రయత్నం చేసే వాళ్లు. ఆ సమయంలో ఉగ్రవాదులకు, మా బెటాలియన్‌కు కాల్పులు జరిగినప్పుడు నాకు దగ్గరగా బాంబ్ పేలింది. 23 రోజులపాటు నా కళ్లు పూర్తిగా కనిపించ లేదు. నా ఎడమ కాలుకు గాయాలయ్యాయి. అయినా, నేను పద్దెనిమిదేండ్ల సర్వీస్ పూర్తి చేసి 2018లో రిటైర్డ్ అయ్యాను. పాకిస్థాన్ మాదిరిగా మన సైనికులు పిరికివాళ్లు కాదు. ఇప్పుడు పిలుపు వస్తే వెంటనే వెళ్లి సైన్యంతో కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం.

- తమ్మిశెట్టి రాజు, మాజీ సైనికుడు, లక్ష్మీదేవిపల్లి (గంగాధర మండలం)



అట్టెపల్లి తిరుపతి

### రక్తం మరుగుతోంది

నేను ఆర్మీలో రిక్రూట్ అయిన ఏడాదికే కార్గిల్ యుద్ధం వచ్చింది. ఎంతో ధైర్యంగా యుద్ధంలో పాల్గొన్న. మోటర్ ప్లటూన్ మద్రాస్ వింగ్‌లో ఉండే వాడిని. 81 ఎంఎం మోటర్ ద్వారా గుండ్లు లోడ్ చేసి కొడితే 5 కిలో మీటర్ల దూరంలోని శత్రువును నాశనం చేసేది. ఆ రోజుల్లో ఎక్కువగా రైఫిళ్లతో ముఖాముఖి యుద్ధమే జరిగేది. శత్రువులు ఎదురు పడితే చంపడమో.. చావడమో అన్నట్లు ఉండేది. కార్గిల్ యుద్ధంలో 2000 డిసెంబర్ 16న మా బెటాలియన్ 16 మంది శత్రువులను మట్టు బెట్టింది. అందులో చురుకుగా పాల్గొన్న నాకు ₹15 వేల రివార్డు ఇచ్చింది. అంతే కాకుండా, యూఎన్ కమిషన్‌కు పంపించింది. కార్గిల్ యుద్ధం తర్వాత ఏడాది పాటు యూఎన్‌లో సేవలు అందించి వచ్చా. మన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇలాంటి అరుదైన అవకాశం ఇప్పటి వరకు నాకు ఒక్కడికే దక్కింది. 18 ఏండ్ల నా సర్వీసులో తొమ్మిదేండ్లు జమ్మూ- కశ్మీర్‌లోనే పని చేశా. మిలిటెంట్లతో నిత్యం ఎన్‌కౌంటర్లు జరిగేవి. భారత సైనికులు చాలా సహనంతో వ్యవహరిస్తారు. ఎలాంటి సందర్భంలోనైనా భారత సైనికులు ముందుగా కాల్పులు జరిపేవారు కాదు. శత్రువులు కాల్పులకు తెగబడితే గానీ మా నుంచి ఎదురు కాల్పులు ఉండేవి కావు. పాకిస్థాన్ పెద్ద పిరికి పంద. చైనా ఆయుధాలు చూసుకుని ఇన్నాళ్లు మురిసి పోయింది. ఇండియా ఆయుధాలపై అవి పని చేయవని తెలిసి చావు భయంతో గగ్గోలు పెడుతున్నది. మన వద్ద అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయి. తలుచుకుంటే పాకిస్థాన్‌ను ఒక గంటలో నేలమట్టం చేసే శక్తి మన దేశం వద్ద ఉన్నది. కానీ, సంయమనం పాటిస్తున్నది. దేశం తరఫున యుద్ధం చేయాలని ప్రతి సైనికునికి ఉంటుంది. కానీ, పాకిస్థాన్ సైనికులకు యుద్ధం అంటే తడిసిపోతది. చస్తామని భయపడి వెనక్కి వెళ్తున్నరు. మనకు వాళ్లకు ఉన్న తేడా అది. యుద్ధం జరిగితే ఇండియానే గెలుస్తది.

- అట్టెపల్లి తిరుపతి, కరీంనగర్

### నేలమట్టం చేసేందుకు ఒక్కరోజు చాలు



నేను 1971 సెప్టెంబర్ 15న ఆర్మీలో రిక్రూట్ అయిన. డిసెంబర్‌లోనే బంగ్లాదేశ్ తరఫున పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్న. అప్పటికి నాకు రైఫిల్ ఎలా పేల్చాలో మాత్రమే తెలుసు. అయినా, ధైర్యంగా మన సైనికులతో కలిసి పోరాడిన. నేను 6వ బెటాలియన్.. అంటే సౌత్ ఇండియా తరఫున యుద్ధంలో పాల్గొన్న. అప్పుడు మమ్మల్ని చూసి పాకిస్థాన్ సైన్యం భయపడి పారిపోయేది. మా ముందు నిలబడలేక పోయేది. అప్పుడు రైఫిళ్లతోనే కొట్లాడేది. పాకిస్థాన్‌ను బంగ్లాదేశ్ నుంచి తరిమి కొట్టేందుకు 12 రోజులు పట్టింది. అప్పుడు ఇంత టెక్నాలజీ ఉండేది కాదు. ఇప్పుడు మన దగ్గర అధునాతన ఆయుధాలు ఉన్నయి. పాకిస్థాన్ మనతో యుద్ధం చేసే పరిస్థితిలో లేదు. ఆ దేశాన్ని నేల మట్టం చేసేందుకు ఒక్క రోజు చాలు. నాకిప్పుడు చేతగాకున్నా యుద్ధంలో పాల్గొనాలని ఉన్నది. సత్తువ లేకున్నా నెత్తురు ఉడుకుతంది. ఇలాంటి సమయంలో దేశ ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలె.

- పింగిలి మల్లారెడ్డి, నర్సింగాపూర్ (వీణవంక మండలం)

### మన ముందు పాక్ మోకరిల్లాల్సిందే..



పాకిస్థాన్‌తో యుద్ధాన్ని ఎదుర్కోవడమే కాదు అవసరమైతే ఆ దేశ భూభాగాన్ని పూర్తిగా ఆక్రమించుకునే శక్తి యుక్తులు ఇండియన్ ఆర్మీకి ఉన్నాయి. ముందు నుంచీ పాక్ కంటే ఎందులోనూ భారత్ తగ్గలేదు. ప్రతి యుద్ధంలో భారత్ గెలిచింది. ఇప్పుడు ఆర్మీ ఎంతో ఆధునికతను పునికి పుచ్చుకున్నది. పూర్తి స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో యుద్ధంలో దూసుకెళ్తున్నది. మన ఇండియన్ ఆర్మీ శక్తి యుక్తుల ముందు పాక్ సైన్యం మోకరిల్లాల్సిందే. నేను ఇండియన్ ఆర్మీలో 1995లో చేరి 2011లో పదవీ విరమణ చేశా. మేం పని చేస్తున్న సమయంలో 1999లో కార్గిల్ యుద్ధం వచ్చింది. అందులో విజయం సాధించడం నా జీవితంలో మర్చిపోలేను. అప్పుడు ఇప్పుడున్నంత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందలేదు. అయినప్పటికీ ఇండియన్ ఆర్మీ ఎప్పుడూ అపజయం చవిచూడలేదు. అప్పుడు మ్యాన్ పవర్ ఎక్కువగా అవసరమయ్యేది. మన బార్డర్ దాటి వాళ్ల బార్డర్‌లోకి వెళ్లి యుద్ధాలకు దిగేవాళ్లం. అక్కడ వాళ్ల బంకర్లను పేల్చి మళ్లీ మన బార్డర్‌లోకి వచ్చే వాళ్లం. అప్పుడు మేం దేన్నైనా పేల్చాలంటే రాకెట్ లాంచర్ల(ఆర్ఆర్ఎల్)ను వాడే వాళ్లం. దాడులకు ఎంఎంజీ, ఏజీఎస్, ఏజీఎల్, ఎస్ఎల్ఆర్, ఏకే-47, ఇన్‌స్ట్రాటైపుల్ లాంటి ఆయుధాలను వినియోగించేవాళ్లం. ఇప్పుడు మన ఆర్మీ చాలా పటిష్టమైంది. రాఫెల్ యుద్ధ విమానాలను వాడుతున్నాం. మన బార్డర్‌లోనే ఉండి ఆ దేశంలోని ఏ స్థావరాన్నైనా కూల్చే శక్తి ఇప్పుడు మన ఆర్మీకి ఉంది. మిషనరీని వినియోగించే సాంకేతికత మన ఆర్మీకి ఉంది. అప్పుడు అటాక్ చేసి అక్కడికి వెళ్లి మన జాతీయ జెండాను పాతే వాళ్లం. ఇప్పుడు వెపన్స్ ఆమేషన్స్ ఉన్నాయి. మరింత దీటుగా ఎలాంటి దాడులనైనా చేయగలం. చేసే వారిని నిలువరించగలం.

- కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న రిటైర్డ్ హవల్దార్ దామోదర్‌రాజు, పెద్దపల్లి

### ఐకమత్యాన్ని చాటుకోవాలె



పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశంలో మతం చిచ్చు రేపాలని చూస్తున్నరు. అందుకే పహల్గాంలో మీరు హిందువులా.. ముస్లింలా అని అడిగి మరీ చంపేశారు. ఇది దారుణం. ఇలాంటి సమయంలో మన దేశ ప్రజలు ఎంతో సంయమనంతో వ్యవహరించారు. ఇది గొప్ప విషయం. ఏ మతాన్ని కించపర్చవద్దు. ఏ మతాన్ని దూషించవద్దు. దేశ సమైక్యతకే ప్రజలను జాగృతం చేయాలె. ఇలాంటి సమయంలో అందరం కలిసి ఉండాలె. మనలో ఐకమత్యాన్ని చాటుకోవాలె. నేను కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుడిని. శత్రువుల దాడిలో నా కన్ను దెబ్బతిన్నది. కార్గిల్ యుద్ధంలో రాజౌరీలో ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. దేశం కోసం కన్ను కోల్పోయినా బాధ పడలె. యుద్ధ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడితేనే విజయం సాధిస్తం. కార్గిల్ యుద్ధం ముగిసిన తర్వాత ఆపరేషన్ పరాక్రమం కోసం మూడేళ్లు రాజౌరీలోనే ఉన్న. ఆ సమయంలో చొరబాట్లకు యత్నించిన మిలిటెంట్లతో అనేక సార్లు ఫైరింగ్‌లో పాల్గొన్న. ఇప్పటికీ మాజీ సైనికుల అవసరం ఏర్పడి పిలుపు వస్తే వెంటనే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న. నాలాగే ప్రతి మాజీ సైనికుడు యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉంటరు. ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న పాకిస్థాన్‌కు భారత్ అంటే ఏంటో చూపించాలె. ఇలాంటి సమయంలో మనం చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలె. యుద్ధమనేది దేశ సరిహద్దుల్లోనే జరగదు. ఏ క్షణంలోనైనా ఎక్కడైనా ఏదైనా జరగవచ్చు. పాకిస్థాన్ చాలా పేద దేశం. ఇప్పటికీ ఆ దేశంలో రవాణా కోసం గాడిదలను ఉపయోగించుకుంటరు. నేను ఎల్‌వోసీకి అవతల ప్రత్యక్షంగా చూసిన. వాళ్లు ఉన్నట్టే ఇండియా కూడా పేదరికంలో ఉండాలనేది వాళ్ల కోరిక. మనం బాగుపడితే వాళ్లు ఓర్చుకోరు. అందుకే మనమీద కుట్రలు చేస్తుంటరు. ఈ కుట్రలను తిప్పి కొట్టాలంటే ఒకసారి తగిన బుద్ధి చెప్పాల్సిందే.

- దురిశెట్టి కిరణ్ కుమార్, కోరుట్ల

## గల్ఫ్ ఏజెంట్ ఘరానా మోసం

- 'అజర్ బైజాన్'లోని కంపెనీలో ఫ్రూట్స్ ప్యాకింగ్ ఉద్యోగాలున్నాయని మాయమాటలు
- 23 మంది నుంచి రూ.80లక్షలు వసూలు
- విజిట్ వీసాలపై దేశానికి పంపి మోసం
- బాధితులు తిరిగొచ్చి ఎస్పీకి ఫిర్యాదు
- ప్రత్యేక బృందాలతో గాలింపు.. అరెస్ట్, రిమాండ్



అశ్వక్ (ఫైల్)

సిరిసిల్ల రూరల్, మే 9: అజర్ బైజాన్ దేశంలోని ఓ కంపెనీలో ఉద్యోగాలున్నాయని చెప్పి, తీరా విజిట్ వీసాపై పంపి 23 మందిని మోసం చేసిన నిజామాబాద్ జిల్లా బీంగల్‌కు చెందిన గల్ఫ్ ఏజెంట్ సయ్యద్ అశ్వక్ సిరిసిల్ల పోలీసులకు చిక్కాడు. తంగళ్లపల్లి ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన పంజా వేణు 14 ఏండ్లుగా ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్నాడు. ఇటీవలే గల్ఫ్ దేశం నుంచి తిరిగి వచ్చాడు. మూడు నెలల క్రితం మళ్లీ గల్ఫ్ వెళ్లేందుకు ఢిల్లీలో ఓ ఇంటర్వ్యూకు వెళ్లాడు. అయితే అక్కడ వేణును సయ్యద్ అశ్వక్ కలిశాడు. యూరప్ దేశంలో అజర్ బైజాన్‌లోని కంపెనీలో సూపర్ వైజర్‌గా ఫ్రూట్స్ ప్యాకింగ్ చేసే పని ఉందని, నెలకు రూ.1.50లక్షల జీతం ఉంటుందని నమ్మించాడు. ప్యాకింగ్ చేసే ఉద్యోగాలు కూడా చాలా ఉన్నాయని, నెలకు రూ.లక్ష జీతం వస్తుందని, ఫ్యామిలీతోనూ అక్కడే సెటిల్ కావచ్చని చెప్పాడు. అశ్వక్ మాటలు వేణు నమ్మాడు. తనతోపాటు మరో 22 మంది కలిసి రూ.80లక్షల వరకు అశ్వక్‌కు ముట్ట జెప్పాడు. కంపెనీ వీసా ఇస్తామని చెబుతూ వచ్చిన అశ్వక్, వారికి విజిట్ వీసాలు చేతిలో పెట్టాడు. అజర్ బైజాన్‌కు వెళ్లగానే కంపెనీ ప్రతినిధులు వచ్చి మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటారని చెప్పి, పంపించాడు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత ఎవరూ రాకపోవడంతో హోటల్‌లో 15రోజుల పాటు ఉన్నారు. మోసపోయామని గుర్తించి ఆందోళన చెందారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి డబ్బులు తెప్పించుకుని, విమాన టికెట్స్ తీసుకోని తిరిగి వచ్చారు. అశ్వక్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించినా ఆచూకీ దొరకలేకపోవడంతో ఎస్పీని ఆశ్రయించారు. బాధితుడు పంజా వేణు ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలించి గురువారం ఢిల్లీ ఎయిర్ పోర్టులో అశ్వక్‌ను పట్టుకుని తీసుకువచ్చారు. శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## పోలీసుల ఫుట్ పెట్రోలింగ్



ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కరీంనగర్ రూరల్ పోలీసులు

కరీంనగర్ రూరల్, మే 9: కరీంనగర్ మండలం బొమ్మకల్ బైపాస్, దుర్శేడ్, తీగలగుట్టపల్లి ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ పీ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్, వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రజల భద్రత కోసం ఎలాంటి అవాంఛనీయ ఘటులు జరుగకుండా వాహనాల తనిఖీ, ఫుట్ పెట్రోలింగ్ చేస్తున్నట్లు సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## ఇసుక రీచ్‌ల రద్దుపై నిరసన

### అన్నింటికీ అనుమతివ్వాలని డిమాండ్

ఎల్లారెడ్డిపేట, మే, 9: మండలంలోని వెంకటాపూర్, నారాయణపూర్ ఇసుక రీచ్‌ల రద్దుపై మండల ప్రజలు, ట్రాక్టర్ యజమానులు ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం నిరసన తెలిపారు. కామారెడ్డి -కరీంనగర్ ప్రధాన రహదారిపై తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రాస్తారోకో చేశారు. ఎస్ఐ రమాకాంత్, ప్రొబెషనరీ ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు రాస్తారోకో చేస్తున్న వారిని చెదరగొట్టారు. అనంతరం కొందరు ప్రతినిధులతోపాటు పలు పార్టీల నాయకులు తహసీల్దార్ సుజాతతో రీచ్‌ల సమస్యపై మాట్లాడారు. ఒకే రీచ్‌కు అనుమతి ఇవ్వడం వల్ల ట్రిప్పునకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని రీచ్‌లకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా వారికి తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఇక్కడ నాయకులు ఎస్కే గౌస్, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.




ఎల్లారెడ్డిపేటలో రాస్తారోకో చేస్తున్న ట్రాక్టర్ యజమానులు, పలు పార్టీల, గ్రామాల ప్రతినిధులు